క్లుప్తంగా

సకాలంలో బిల్లులు చెల్లించండి

మలికిపురం: ఇచ్చిన 14 రోజుల్లోపు విద్యుత్ బిల్లులు చెల్లించి, అపరాధ రుసుం మినహాయింపు పొందాలని మలికిపురం విద్యుత్ శాఖ ఏఈ మద్దూరి సతీష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ యాప్‌లతో పాటు అన్ని గ్రామ సచివాలయాల్లో కూడా విద్యుత్ బిల్లులు చెల్లించే వెసులు బాటు కల్పించారన్నారు.

అబ్బురపరిచిన బాల అర్చకుడు



భక్తులకు ఆశీస్సులు అందజేస్తున్న అభిరామ్

అంబాజీపేట: హిందూ సంస్కృతి సాంప్రదాయాలపై ఎంతో ఆసక్తి కలిగి, పట్టుమని పదేళ్లు కూడా లేని ఆ బుడతడు అర్చక స్వామి అవతారమెత్తాడు. మహాశివరాత్రి సందర్భంగా పుల్లేటికుర్రు శివాలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ రమా సత్యనారాయణ స్వామి ఆలయంలో వెలవలపల్లి అభిరామ్ భక్తులకు ఆశీస్సులు అందించారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ



విజేతలతో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

అయినవిల్లి: ముక్తేశ్వరం వైవీఎస్ అండ్ బీఆర్ఎం పాలిటెక్నిక్ కళాశాలలో నాలుగు రోజులుగా అప్పారి నాగభూషణం మెమోరియల్ ఆధ్వర్యంలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ పోటీలు శనివారం ముగిశాయి. విజేతలకు స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు విజేతలైన ముక్తేశ్వరం జయంతి రామయ్య పంతులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జట్లకు టోఫీ అందజేశారు. కార్యక్రమంలో కళాశాల రెసిడెన్షియల్ డైరెక్టర్ కుమారస్వామి, తదితరులు ఉన్నారు.

కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం

పి.గన్నవరం: స్థానిక ఏజీ రోడ్డులోని శ్రీలక్ష్మీ కనకదుర్గమ్మ ఆలయ 28వ వార్షికోత్సవాలు ఆదివారం నుంచి 21వ తేదీ వరకూ ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ నాయకుడు అడ్డగర్ల నారాయణమూర్తి తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం సాయంత్రం మహిళలతో 108 కలశల పూజలు, సామూహిక కుంకుమార్చనలు జరుగుతాయన్నారు. రాత్రి దుర్గాహోమం, నిప్పులగుండం కార్యక్రమంలో భక్తులు పాల్గొంటారని వివరించారు. 20న అమ్మవారికి లక్ష కుంకుమార్చన పూజలు, 21న చండీ హోమం నిర్వహిస్తారన్నారు. అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

బులుసు సాంబమూర్తికి ఘన నివాళి

కొత్తపేట: భారత స్వాతంత్ర్య సమరయోధుడు, ఉమ్మడి మద్రాస్ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ మహర్షి బులుసు సాంబమూర్తి జయంతి పురస్కరించుకుని శనివారం పలివెల గ్రామంలో పలువురు నివాళులర్పించారు. మహాత్మా గాంధీ అధ్యయన సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి దుళ్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సాంబమూర్తి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. డాక్టర్ పీ కృష్ణారావు, సంస్థ సభ్యులు పెంటపాటి బాబ్జి, కంకటాల చినబాబు, ఎస్.దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధనలు అనిర్వచనీయం

ఆలమూరు: అన్ని దానాల్లో కన్నా అన్నదానం అనిర్వచనీయం, అభినందనీయమని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మడికిలో ఉన్న అభయాంజనేయ స్వామి అంతర్రాష్ట్ర కూరగాయల మార్కెట్‌లో శనివారం నిర్వహించిన భారీ అన్నసమారాధనను ఆయన ప్రారంభించారు. పిండివంటలతో ఏర్పాటు చేసిన ఈ అన్నసమారాధనలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పాల్గొని భక్తులకు వడ్డించారు. ఈ అన్నదానంలో సుమారు పది వేల మంది పాల్గొన్నారు. ఏటా వేలాది మందికి అన్నసమారాధన నిర్వహిస్తున్న మార్కెట్ కమిటీని ఎమ్మెల్యే అభినందించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు యనమదల నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే జొన్నాడ గౌతమీ గోదావరి తీరంలో వెదిరేశ్వరం గ్రామానికి కర్షి భక్తుల సంఘం సుమారు మూడు వేల మందికి అన్నసమారాధన జరిపింది.

కనకదుర్గమ్మకు వెండి త్రిశూలం సమర్పణ



త్రిశూలం సమర్పిస్తున్న శివరామకృష్ణ దంపతులు

పి.గన్నవరం: గ్రామంలోని శ్రీలక్ష్మీ కనకదుర్గమ్మ వారికి కడలి శివరామకృష్ణ, పద్మావతి దంపతులు శనివారం రూ.40 వేల విలువ చేసే వెండి త్రిశూలం బహూకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆలయ అర్చకులు వాడపల్లి రాంబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ నాయకుడు అడ్డగర్ల నారాయణమూర్తి, భక్తులు పాల్గొన్నారు.

ఓం నమశ్శివాయ..!

- కిటకిటలాడిన శైవక్షేత్రాలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు
- స్వామివారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

మహాశివరాత్రి వేడుకలు పి.గన్నవరం, రాజోలు, కొత్తపేట నియోజకవర్గాల్లో శనివారం వైభవంగా జరిగాయి. శైవక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. గ్రామాల్లో ఆలయాలన్నీ కిక్కిరిశాయి. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేకువ జాము నుంచి స్వామి, అమ్మవార్ల దర్శనం భక్తులకు కల్పించారు.



జొన్నాడలో విశ్వేశ్వరస్వామికి భక్తుల పూజలు



గూడపల్లిలో స్వామివారికి అభిషేకం చేస్తున్న దృశ్యం



కొత్తపేట మండలం పలివెలలో రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

కొత్తపేట: పలివెల ఉమాకొప్పేశ్వరస్వామి క్షేత్రంలో రథోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ఈ రథోత్సవాన్ని ప్రారంభించగా అత్యంత వైభవంగా సాగింది. ముందుగా ఈ కార్యక్రమానికి విచ్చేసిన జగ్గిరెడ్డికి గ్రామ ముఖ ద్వారంలో ఎంపీపీ మార్గన గంగాధరరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ భమిడిపాటి దుర్గాలక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఆలయం వద్ద జగ్గిరెడ్డి ఈఓ నడింపల్లి ప్రసాదరాజు, సిబ్బంది, వేదపండితులు స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

పలివెల క్షేత్రానికి పోటెత్తిన భక్తజనం

పలివెల గ్రామంలో ఉమా కొప్పేశ్వరస్వామి వారి క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. శనివారం అర్ధరాత్రి నుంచే స్వామి–అమ్మ వారిని దర్శించుకున్నారు. పలువురు ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు అల్పాహారం, పాలు, వాటర్ ప్యాకెట్లు సమకూర్చారు. విద్యార్థులు వలంటరీ సేవలందిచారు. రావులపాలెం సీఐ ఎస్.రజనీకుమార్ ఆధ్వర్యంలో కొత్తపేట ఎస్సై వీ.మణికుమార్ ప్రత్యేక పోలీస్ బందోబస్తు నిర్వహించారు. కొత్తపేట హరిహర దేవాలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. రాజరాజేశరస్వామి వారి దర్శనానికి భక్తులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చారు.

ఆలమూరు: జొన్నాడలోని గౌతమీ గోదావరి నదిలో స్నానమాచరించిన భక్తులు అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామిని దర్శించుకున్నారు. దక్షిణ భారత దేశంలో ప్రసిద్ధి గాంచిన ఆలమూరులోని పార్వతీ సమేత విక్రమార్క భట్టీశ్వర దేవాలయం, పెనికేరులో వ్యాస మహర్షితో నిర్మించిన బాలా త్రిపుర సుందరి సమేత శ్రీఇష్ట కాంతేశ్వరస్వామి ఆలయాలకు భక్తుల తాకిడి ఎక్కువగా ఉంది. గ్రామాల్లోని శివలయాలు భక్తులతో కిక్కిరిశాయి.

శివనామస్మరణలతో...

సఖినేటిపల్లి: మండలంలో శైవక్షేత్రాలు శివనామస్మరణలతో ప్రతిధ్వనించాయి. మోరి సీతారామలింగేశ్వరస్వామి, గుడిమూల కృతకృత్యరామలింగేశ్వర స్వామి, అంతర్వేది నీలకంఠేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు సామూహిక రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. స్వామి వారిని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు దర్శించి, పూజలు చేశారు. వెంట ఆలయ చైర్మన్ జాన సునీల్, మెంబర్ చింతా వెంకటరమణి, సర్పంచ్ లక్ష్మీపద్మ తదితరులు పాల్గొన్నారు.

కృతకృత్య రామలింగేశ్వర స్వామి వారి రథోత్సవం వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు, కె.వి.చంటిరాజు, కేఎస్ఎన్ రాజు, ఎంపీపీ వీరా మల్లిబాబు, జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.



మోరి శివాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

మలికిపురం: మండలంలోని శివాలయాలకు భక్తులు పోటెత్తాయి. గుడిమూల, కత్తిమండ, చింతలమోరి, విశ్వేశ్వరాయపురం, కేశనపల్లి తదితర ఆలయాల్లో కల్యాణాలు, పూజలు నిర్వహించారు.

అంబాజీపేట: మండలంలో మహాశివరాత్రి మహోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. పుల్లేటికుర్రులో వ్యాఘ్రేశ్వరం గ్రామంలో ఉన్న బాలాత్రిపుర సుందరి సమేత వ్యాఘ్రేశ్వరస్వామి, మాచవరంలో శ్రీ పార్వతి రాజేశ్వరస్వామివారి ఆలయం, కందుల మల్లేశ్వరస్వామికి, గంగలకుర్రు అగ్రహారం ఉమాపార్వతి సమేత వీరేశ్వరస్వామికి కోఠివారి అగ్రహారంలో భువనేశ్వరి సమేత విశ్వేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక వీరభద్ర థియేటర్, పోలీస్ స్టేషన్ పక్కన, మాచవరంలలో శివరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు.

మోరి, గుడిమూలలో రథోత్సవాలు

సఖినేటిపల్లి: మోరి, గుడిమూల గ్రామాల్లో శనివారం రథోత్సవాలను ఘనంగా నిర్వహించారు. రథాలకు అరటి గెలలు, గుమ్మడి కాయలు కట్టించుకుని భక్తులు మొక్కులు చెల్లించారు. రథాలను వివిధ రకాల పూవులతో ఆకర్షణీయంగా అలంకరించారు. గ్రామాల్లోని ప్రధాన మార్గాల్లో ఈ రథయాత్ర సాగింది.

ఆత్రేయపురం: మండలంలోని శివాలయాల్లో భక్తులతో కిటకిటలాడాయి. మండల పరిధిలోని వసంతవాడ పార్వతీ పరమేశ్వర ఆలయంలో కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పూజలు చేశారు. ఆలయ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. ఆయన వెంట మాజీ ఏఎంసీ చైర్మన్ ముదునూరి రామరాజు, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, మాజీ ఎంపీపీ పీఎస్ రాజు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పెన్మెత్స బంగార్రాజు, సర్పంచ్ గాదిరాజు రామకృష్ణంరాజు ఉన్నారు. స్థానిక బాల త్రిపుర సుందరి సమేత రాజరాజేశ్వరీ ఆలయం, వాడపల్లి అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. ర్యాలి ఉమా కమండలేశ్వర స్వామి ఆలయం, జగన్మోహనీ కేశవ స్వామి ఆలయం, కట్టుంగ, రాజవరం తదితర ఆలయాలు హర హర మహా దేవా అంటూ భక్తులు పొట్టెత్తారు. ఆయా ఆలయాల వద్ద ఆత్రేయపురం ఎస్సై సీహెచ్ సుధాకర్ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకండా ప్రత్యేక పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

రావులపాలెం: స్థానిక వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని శివాలయం, ఊబలంక సర్వమంగళ సమేత ఉమామహేశ్వర స్వామి ఆలయం, లక్ష్మీపోలవరం శ్రీవల్లి నాగేశ్వర స్వామి ఆలయం, ఈతకోట ఉమాపార్వతి ఆలయం, ముమ్మిడివరప్పాడు పశ్చిమ ముఖ శివాలయంతో పాటు పలు గ్రామాల్లో గల శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

అయినవిల్లి: మండలంలోని ముక్తికాంత క్షణముక్తేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిచారు. స్వామిని స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు దర్శించుకున్నారు. తొలుత ఎమ్మెల్యే స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ముక్తేశ్వరం వృద్ధగౌతమి (తొగరపాయ) వద్ద భక్తులు అదిక సంఖ్యలో పుణ్యస్నానాలు ఆచరించారు. అయినవిల్లి, వీరవల్లిపాలెం, నేదునూరు, విలస, సిరిపల్లి, మాగాం, కె.జగన్నాథపురం, శానపల్లిలంక, పోతుకుర్రు గ్రామాల్లోని శివాలయాల్లో శివరాత్రి వేడుకలు ఘనంగా జరిపారు.



మాచవరంలో మల్లేశ్వరస్వామి వారి అభిషేకాల్లో పాల్గొన్న భక్తులు



గుడిమూలలో భక్తులు నిర్వహిస్తున్న రథయాత్ర



పెదపట్నంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ప్రభలు

శివనామస్మరణతో..

రాజోలు: మండలంలోని శివకోటి, కడలి, రాజోలు శివాలయాలు భక్తుల శివనామస్మరణతో మార్మోగాయి. శనివారం రాజోలు వీరభద్రస్వామి, అయ్యప్ప స్వామి వార్ల ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామి వారిని వశిష్టాగోదావరి తీరం వరకూ ఊరేగించారు. రాజోలు, శివకోటి శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రాజోలులో బ్రహ్మ కుమారీస్ ఆధ్వర్యంలో రాజస్థాన్ మౌంట్‌ఆబూ నుంచి తీసుకుని వచ్చి ఏర్పాటు చేసిన మహేశ్వర శివలింగ ప్రతిరూపం ఆకట్టుకుంది.



రాజోలు శివాలయంలో అభిషేకం చేస్తున్న అర్చకస్వాములు

ఆకట్టుకున్న శివలింగం



గుబ్బలవారిపాలెంలో ఏర్పాటు చేసిన తులసీదళ శివలింగం

రాజోలు: పొన్నమండ భీమేశ్వరస్వామి ఆలయం వద్ద 15 అడుగుల ఎత్తులో భారీ శివలింగం ఏర్పాటు చేశారు. స్థానిక యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శివలింగం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. కడలిలోని గుబ్బల వారి గ్రూపులో ఏర్పాటు చేసిన తులసి దళాలతో తయారు చేసిన శివలింగం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

హరహర మహాదేవా.. శంభోశంకరా!

మామిడికుదురు: మండలంలో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అప్పనపల్లి మైనర్ రాజుగారి వీధిలో బాల గణపతి మిత్ర బృందం ఆధ్వర్యంలో 10,116 జ్యోతులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక దీపాలంకరణ, భారీ సెట్టింగులతో పాటు గ్రామంలోని సంతపేటలో జై గౌరీ శంకర భక్త బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దీపాలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మొగలికుదురు భద్రకాళీ సమేత వీరభద్రస్వామి వారి రథోత్సవం కనుల పండువగా జరిగింది. పెదపట్నం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అప్పనపల్లి కనక మహాలక్ష్మమ్మ, వీరభద్రస్వామి ఆలయాలు, పాశర్లపూడి, మొగలికుదురు, ఈదరాడ, మగటపల్లి, గోగన్నమఠం, ఈదరాడ, ఆదుర్రు, లూటుకుర్రు, పాశర్లపూడిలంక తదితర గ్రామాల్లోని ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన దీపాలంకరణలు భక్తుల్ని పరవశింపజేశాయి.



అప్పనపల్లిలో ఆకట్టుకున్న నాణేలతో రూపొందించిన శివలింగం



అప్పనపల్లిలో కూరగాయలతో తయారు చేసిన అమ్మవారి షెట్టింగ్

శనైశ్చర క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

- శనీశ్వరునికి పూజలు, తైలాభిషేకం
- దేవస్థానానికి రూ.27.68 లక్షల ఆదాయం



క్యూలో ఉన్న భక్తులు

కొత్తపేట: మహాశివరాత్రి, శని త్రయోదశి పర్వదినం సందర్భంగా కొత్తపేట మండలం మందపల్లి ఉమా మందేశ్వర(శనైశ్చర) క్షేత్రానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. శనివారం, త్రయోదశి తిథి కలిసి రావడం (శనిత్రయోదశి)తో పాటు ఈ సారి అమావాస్య ముందు శనిత్రయోదశి, ఇదే రోజు మహాశివరాత్రి కావడం విశేషం. శనిదోష నివారణకు దేశ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ఈ శనైశ్చర క్షేత్రానికి భక్తులు తరలివచ్చారు. శుక్రవారం రాత్రి నుంచి మందపల్లికి భక్తుల రాక ప్రారంభమై తెల్లవారే సరికి క్రమేపీ అత్యధిక సంఖ్యలో పెరిగిపోయిన భక్తజనంతో మందపల్లి క్షేత్రం కిటకిటలాడింది. భక్తులు సౌకర్యార్థం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ఆదేశాల మేరకు ఆర్డీఓ ఎం.ముక్కంటి, దేవదాయ-ధర్మదాయ శాఖ డీసీ ఎం.విజయరాజు పర్యవేక్షణలో అసిస్టెంట్ కమిషనర్, దేవస్థానం ఈఓ సింగం రాధ, అంతర్వేది దేవస్థానం ఈఓ, శనైశ్చర క్షేత్రం సీఎఫ్ఓ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆలయ ప్రాంగణం, ఆలయం వెలుపల, వెనుక పూజల ప్రాంగణం అంతా 5 చోట్ల పూజలు, అభిషేకాలకు ఏర్పాట్లు చేశారు. అనంతరం స్వామివారి తైలాభిషేకానికి నాలుగు క్యూ లైన్లలో భక్తులు బారులు తీరారు. స్థానిక డీఎస్పీ కేవీ రమణ పర్యవేక్షణలో రావులపాలెం సీఐ ఎస్.రజనీకుమార్, కొత్తపేట ఎస్సై వి.మణికుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

శనైశ్చరుని ఆదాయం రూ 27.68 లక్షలు

శనైశ్చర స్వామివారిని సుమారు 60 వేల మంది భక్తులు దర్శించుకున్నట్టు ఈఓ సింగం రాధ తెలిపారు. భక్తుల ప్రత్యేక సేవల ద్వారా రూ.24,81,800, పరోక్ష సేవల ద్వారా రూ.2,86,300 ఆదాయం వచ్చినట్టు తెలిపారు.

ఘనంగా ఆయుష్ హోమం



ఆయుష్ హోమం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

అంబాజీపేట: కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ పుట్టినరోజును పురస్కరించుకుని పుల్లేటికుర్రు బాలా త్రిపుర సుందరి సమేత అభినవ వ్యాఘ్రేశ్వర స్వామివారి ఆలయ ప్రాంగణంలో ఆయుష్ హోమం శనివారం నిర్వహించారు. ఆలయ అర్చకులు పుల్లేటికుర్తి లింగమూర్తి, వెలవలపల్లి వ్యాఘ్రేశ్వర శర్మ ఆధ్వర్యంలో హోమాన్ని నిర్వహించారు. ఏకాదశ రుద్రుల ఆలయాలైన వ్యాఘ్రేశ్వరం, కె.పెదపూడి, గంగలకుర్రు అగ్రహారం, గంగలకుర్రు, వక్కలంక, నేదునూరు, ముక్కామల, మొసలపల్లి, పాలగుమ్మి ఆలయాల్లో విజయేంద్ర సరస్వతి పేరున ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జల్లి బాలరాజు, ఎంపీటీసీ సభ్యుడు పబ్బినీడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు చేర్చడమే లక్ష్యం

- ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు
- సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు అవగాహన సదస్సు



అంబాజీపేటలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: కుల, మత, రాజకీయాలకతీతంగా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పని చేయాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మాచవరంలో టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ కో ఆప్షన్ సభ్యులు పి.కె.రావు కొబ్బరి గొడౌన్ వద్ద వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి నాగవరపు నాగరాజు అధ్యక్షతన గ్రామ సచివాలయ కన్వీనర్లకు, కార్యకర్తలకు మార్చి 18వ తేదీ నుంచి నిర్వహించే జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలన్నారు. వలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులైతే గృహసారథులు పార్టీకి ప్రజలకు మధ్య వారధులన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందుతున్నాయో లేదా సమీక్షించడంతో పాటు పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రజలకు ఏవైనా సమస్యలుంటే అధికారులు, నాయకుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. గృహ సారథులు ఇంటింటికి వెళ్లినప్పుడు వారి అనుమతితో సెల్‌ఫోన్, ఇంటి గోడపై ×మా నమ్మకం నువ్వే జగన్ె స్టిక్కర్లు వేయాలన్నారు. సమావేశంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్, సొసైటీ అధ్యక్షుడు కొర్లపాటి కోటబాబు, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, అప్పన శ్రీను, కుసుమ శ్రీను, సర్పంచ్‌లు, ఎంపీటీసులు తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన బాలాజీ ఆలయం



పి.గన్నవరంలో గరుడేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకస్వామి



స్వామి వారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ స్వామి వారి ఆలయం శనివారం భక్తులతో కోలాహలంగా మారింది. స్వామి దర్శనానికి భారీగా భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. కాశీ అంతటి పవిత్రతను సంతరించుకుని ఉత్తర వాహినిగా ప్రవహిస్తున్న పవిత్ర వైనతేయ గోదావరి నదిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. ఉభయ స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారికి వివిధ సేవల ద్వారా రూ.1.88 లక్షలు ఆదాయం వచ్చింది. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా స్వామి వారికి రూ.1.29 లక్షలు ఆదాయం వచ్చింది. స్వామి వారి నిత్యాన్నదానం ట్రస్టుకు భక్తులు రూ.58,456 విరాళాలుగా సమర్పించారు. స్వామి వారిని 3,569 మంది భక్తులు దర్శించుకున్నారు. 2,984 మంది భక్తుల స్వామి వారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎంకేటీ నాగవరప్రసాద్, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ధర్మకర్తల మండలి సభ్యులు కొమ్ముల సూరిబాబు, చిట్టాల సత్తిబాబు, గూటం శ్రీనివాస్, ఆలయ ఉద్యోగులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భక్తులతో కిటకిట..

పి.గన్నవరం: స్థానిక గరుడేశ్వరాలయంలో అర్చకులు పూజ్యం భావన్నారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో స్వామివారికి తెల్లవారు జామునుంచి అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. వివిధ గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. పి.గన్నవరం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పాబోలు కృష్ణమూర్తి, సంఘ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

రూ.15 లక్షలతో ఆలయం ఆధునీకరణ

ఆర్.ఏనుగుపల్లి శివారు కారుపల్లిపాడులో పార్వతీ, సోమేశ్వరస్వామి వారి ఆలయాన్ని దాతలు, గ్రామస్తుల విరాళాలు రూ.15 లక్షల వ్యయంతో ఆధునీకరించారు. ఆలయం చుట్టూ ప్రహరీ నిర్మించి, రంగులు వేశారు. ధ్వజస్తంభాన్ని ఇత్తడి తొడుగులతో ఆధునీకరించారు. అన్న సమారాధన చేశారు.

కోనసీమ వెంకన్నకు ప్రత్యేక పూజలు



దాతకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న చైర్మన్ రమేష్‌రాజు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. శనివారం అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారికి దర్శించుకున్నారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేక పువ్వులతో అలంకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు మాట్లాడుతూ స్వామి వారి ఆలయంలో నిర్వహించే నిత్యాన్న దాన పథకానికి కలిదిండి మండలం కాల్లపాలెంకు చెందిన పి.మోహన్‌మురళీ, రెనుకాంబ రూ.12 వేల విరాళం అందించినట్టు తెలిపారు. దాతకు ఆలయ కమిటీ చైర్మన్ రమేష్‌రాజు చేతుల మీదుగా స్వామి వారి చిత్రపటం అందజేశారు.